సీఎం రేవంత్‌రెడ్డికి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజలకు హాజరు కావాలని కోరుతూ మంగళవారం కీసరగుట్ట దేవాలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ నరేందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సు. ధీర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, దేవాలయ వంశపారంపర్య ధర్మకర్తలు తటాకం వెంకటేష్, తటాకం ఉమాపతి, తటాకం నారాయణ, తటాకం రమేష్ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

ఎమ్మార్‌సీఈలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎమ్మార్‌సీఈ) కళాశాలలో మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. విప్రో సంస్థ 27 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

మయోర కంపెనీ యూనియన్ నూతన కార్యవర్గం



మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మయోర కంపెనీ నూతన కార్యవర్గాన్ని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి యాజమాన్య ప్రతినిధులతో జీతం పెంపు, బోనస్ కోత, క్యాంటిన్, పని ఒత్తిడి తదితర అంశాలపై చర్చించారు. అనంతరం యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి, జనరల్ సెక్రటరీగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బాలమల్లేష్, నర్సింలు, సంయుక్త కార్యదర్శులుగా మధుసూదన్‌రెడ్డి, మల్లేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీను, కోశాధికారిగా ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మేడ్చల్: ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి అన్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. నిర్ణీత గడువు లోపు ధరణి సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల పనితీరు, రికార్డులను పరిశీలించి సిబ్బంది ద్వారా పలు వివరాలను తెలుసుకున్నారు. మేడ్చల్ తహసీల్దార్ శైలజతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాలు

మేడ్చల్: సికింద్రాబాద్ రీజియన్‌లోని వివిధ డిపోల ఆర్టీసీ కార్మికులకు త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాలు అందజేశారు. మేడ్చల్ డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లకు హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఖుస్రుశాఖాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు, రీజియన్ సూపర్‌వైజర్లు, డిపో మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పురుగుల భోజనం సిగ్గుచేటు

మేడ్చల్: లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ పిల్లలకు పెట్టే భోజనంపై ప్రేమ లేకపోవడం మల్లారెడ్డి కళాశాల యాజమాన్యానికి సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రాథోడ్ అన్నారు. మేడ్చల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మల్లారెడ్డి యూనివర్సిటీలో, మల్లారెడ్డి కళాశాలల్లో విద్యార్థినులకు నాసిరకం భోజనం, పురుగుల భోజనం పెడుతున్నారని అన్నారు. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ పురుగుల అన్నం పెట్టడం ఎంత వరకు సమంజసం అన్నారు. పిల్లలకు పురుగుల భోజనం పెడుతున్న మల్లారెడ్డి హాస్టళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యదర్శి కార్తీక్, నాయకులు నిఖిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం కోసం రూ.లక్షల వసూలు



మాట్లాడుతున్న సంతోష్ రాథోడ్

మల్లాపూర్: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను నాచారం డివిజన్‌కు చెందిన దళిత జన సమితి ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యా, వైద్యం విషయంలో లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొజ్జ యాదగిరి, ఉపాధ్యక్షులు సంపత్, కార్మిక విభాగం అధ్యక్షులు బొజ్జ రమేష్, గంగాధర్, బాలయ్య, మజీద్, భార్గవ్, తదితరులు ఉన్నారు.

శివోహం

నేటి నుంచి కీసరగుట్టలో బ్రహ్మోత్సవాలు





క్యూలైన్లు

కీసర: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్ట ముస్తాబైంది. బుధవారం నుంచి 11వ తేదీ వరకు ఆరు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరవుతారు. ఇప్పటికే కీసరగుట్ట ముస్తాబైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

లక్షల మంది యాత్రికులు వస్తారని..

కీసరగుట్ట జాతరకు 4 నుంచి 5 లక్షల మంది యాత్రికులు వస్తారని, అధికారులు ఆలయ సిబ్బంది అంచనా వేస్తున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ కమిటీల అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. నేటి నుంచి పోలీసులు, పారిశుద్ధ్య సిబ్బంది, మిషన్ భగీరథ, వైద్య, విద్యుత్ తదితర అధికారులు జాతర విధుల్లో నిమగ్నం కానున్నారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహించే జిల్లాస్థాయి క్రీడోత్సవాలు నిర్వహించడంలేదు. దీంతో పాటు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ కూడా ఈసారి ఏర్పాటు చేయడం లేదు.



లడ్డూ ప్రసాదం

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామి దర్శనం కోసం కీసరగుట్టకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సహకారంతో జాతరను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. క్యూలైన్లలో ఉండే భక్తులకు వీలైనంత త్వరలో దర్శన సౌకర్యం కల్పించే విషయమై ప్రధానంగా దృష్టి సారిస్తాం. ఇప్పటికే 50 వేల లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచాం. అవసరం మేరకు ప్రసాదాల తయారీ పెంచుతాం.

– తటాకం నాగలింగం, ఆలయ చైర్మన్

ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్‌సాబేర్ అలీ

ఘట్‌కేసర్: మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.500లకు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం రాని వారు ఆధార్, రేషన్‌కార్డు, ప్రజాపాలన రశీదుతో మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలన్నారు.

6న తైబజార్ వేలం పాట

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 6న మధ్యాహ్నం 3 గంటలకు తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటలోపు దరఖాస్తు రుసుము కింద రూ.2 వేలు, డిపాజిట్ రూపంలో రూ.లక్ష చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు మున్సిపల్ ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు.

బిల్లు మంజూరు చేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ ఆఫీస్ సమీపంలో నూతనంగా నిర్మించిన రీడింగ్ రూమ్‌లో పుస్తకాలు, పత్రికల కోసం బిల్లు మంజూరు చేయాలని కోరుతూ అదనపు కలెక్టర్‌కు చైర్మన్ చంద్రారెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ చెప్పారు.

ఘట్‌కేసర్‌కు ఎంఎంటీఎస్ ట్రెయిన్ ప్రారంభం



ఘట్‌కేసర్‌లో జెండా ఊపి ఎంఎంటీఎస్ ట్రెయిన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, డీఆర్ఎం బతేశ్‌కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: లింగంపల్లి – ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ ట్రెయిన్‌ను మంగళవారం ప్రారంభించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ సంగారెడ్డిలో వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ముఖ్య అతిథి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, డీఆర్ఎం బత్తేశ్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఎంపీపీ సుదర్శన్ రెడ్డితో కలిసి జెండా ఊపి ట్రెయిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఘట్‌కేసర్ ప్రజల దశాబ్దాల కల ఎంఎంటీఎస్ ట్రెయిన్ ప్రారంభించడం హర్షణీయమని అన్నారు. ఎంఎంటీఎస్ రైళ్ల రాకతో పేదలు తక్కువ సమయంలో, తక్కువ టికెట్ ధరతో ప్రయాణం చేయవచ్చన్నారు.

ఈ సందర్భంగా ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ వరకు ఎంఎంటీఎస్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేశారు.

మహా శివరాత్రి వేడుకలు ప్రారంభం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని గోవింద్ శాంతి బింద్రాజ్కు సేవా ట్రస్ట్ ప్రాంగణంలో మహా శివరాత్రి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు వెస్ట్ మారేడ్‌పల్లిలోని బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామివారికి అభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దీపోత్సవాలతో మొదలయ్యాయి. 9వ తేదీ వరకు ఆధ్యాత్మిక ప్రదర్శనలు నిర్వహిస్తామని, శివారాధకులు, భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. 7వ తేదీన ప్రత్యేక అభిషేకాలు, దీపోత్సవం, మహాహారతి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఈటల రాజేందర్



బోడుప్పల్: బోడుప్పల్‌లోని శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి 26వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలకు మంగళవారం మాజీ మంత్రి, బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే విధంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ వారి కల్యాణ మహోత్సవం, బోనాలు సమర్పించడం, గొలుసు తెంపుట, అగ్ని గుండాలు తొక్కుట, ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు యాదవ్, బీజేపీ నేతలు ఏనుగుల లక్ష్మయ్య, జనిగె వెంకటేశ్‌యాదవ్, జడిగె శ్రీశైలం, జనిగె శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి గాంధీనగర్ యూత్ ప్రతినిధులు

కాప్రా: గాంధీనగర్ యూత్ అసోసియేషన్‌కు చెందిన పలువురు ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీనగర్ యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలు, యువత, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కాప్రా డివిజన్ అభివృద్ధికి పాటుపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, బాలయ్య, శ్రీహరి, రాంచందర్, శ్రీకాంత్, దశమంత్, రాజు, యాదగిరి, రవి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టండి



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌యాదవ్

బోడుప్పల్: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జలమండలి అధికారులు చూడాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం జలమండలి అధికారులు, కార్పొరేటర్లతో కలిసి నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్‌లో పైపులైన్ల సమస్యలు, లీకేజీలు, కొత్త వాటర్ పైపులైన్ల మొదలగు వాటిని గురించి కార్పొరేటర్లు, అధికారులతో చర్చించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్‌ల పరిధిలో ఉన్న సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

పోచారంలో రూ.12 కోట్ల భూకుంభకోణం

రైతు సహకార సంఘ వైస్ చైర్మన్, కుటుంబ సభ్యులపై కేసు నమోదు



భూకుంభకోణం వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు బద్దం నరేందర్‌రెడ్డి

పోచారం: పూర్తి హక్కులు లేకుండా ప్లాట్లను విక్రయించిన నలుగురు వ్యక్తులపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సుమారు రూ.12 కోట్ల విలువ చేసే భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించిన నలుగురు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఐదో అదనపు మెట్రోపాలిటిన్ కోర్టును బద్దం నరేందర్‌రెడ్డి ఆశ్రయించారు. దీంతో సదరు వ్యక్తులు బద్దం అనంతరెడ్డి, బద్దం కళావతి, బద్దం నర్సింహారెడ్డి, మంద వినోదలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోచారం సర్వే నంబర్ 36లో పూర్వీకులకు చెందిన 36 ఎకరాల 18 గుంటల భూమిలో 34 ఎకరాల 19 గుంటల భూమికి 1986లో బద్దం అడివిరెడ్డి, బద్దం బుచ్చిరెడ్డి, బద్దం మంగారెడ్డికి జీపీఏ ఇవ్వగా, ఎకరం 39 గుంటల భూమి మిగిలిందని, ఈ భూమిపై తనకు హక్కులున్నాయని బాధితుడు బద్దం నరేందర్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. పైన పేర్కొన్న భూమిలో ప్లాట్ల క్రయవిక్రయాలు జరపవద్దని 2022లో పత్రికా ప్రకటన ఇచ్చామన్నారు. అయినప్పటికీ అదే భూమిని శ్రీనివాస్‌నగర్ కాలనీ పేరుతోనే 33 ప్లాట్లుగా విభజించి తప్పుడు ధృవపత్రాలు, ఫోర్జరీ సంతకాలతో ఘట్‌కేసర్ రైతు సహకార సంఘం వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు బద్దం అనంతరెడ్డి, అతడి కుటుంబ సభ్యులు బద్దం కళావతి, బద్దం నర్సింహారెడ్డి, మంద వినోద విక్రయించి భూకుంభకోణం సృష్టించారన్నారు. ఈ నలుగురు నిందితులు తన ఇంటికి వచ్చి కేసు వాపసు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో పాటు నీ అంతు చూస్తామని బెదిరించినట్లు నరేందర్‌రెడ్డి ఆరోపించారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: గృహలక్ష్మి, మహాలక్ష్మి దరఖాస్తు చేసుకున్న వారందరి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా సరి చేసి అర్హులకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధి చేకూర్చాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల వద్దే ఈ ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీసీహాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వీ తదితర అధికారులతో ఆయన మాట్లాడారు. ఎండ తీవ్రను దృష్టిలో పెట్టుకుని షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి వసతి ఉండేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. బోడుప్పల్, నిజాంపేట్, జవహర్‌నగర్‌లో అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ఉంటారని, అవసరమైతే 2 లేదా 3 కంప్యూటర్లను ఏర్పాటు చేసి, ఆపరేటర్లను అందుబాటులో ఉంచాలన్నారు. రద్దీగా ఉన్న చోట ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు దగ్గరుండి దరఖాస్తులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 15వ డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా కామాక్షి



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మహిళ కమిటీని పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా నాటం కామాక్షి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జపాల నవనీత, మార్కుల సుకన్య, ప్రధాన కార్యదర్శిగా సింధు, కమిటీ సభ్యులుగా రేణుక, శ్యామల, సుష్మ, లావణ్య, అనసూయ, విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి, గండి సునీత, రజితాగోపాల్, సుగుణ, విజయ, లత, భాగ్యలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన




సాంబయ్య(ఫైల్)



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మేడ్చల్‌రూరల్: ఛాతిలో నొప్పి అంటూ ఆస్పత్రికి వచ్చిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించగా వైద్యుల నిర్లక్ష్యం కారణంతోనే మరణించాడంటూ కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేసిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెడిసిటీ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే శామీర్‌పేట్‌కు చెందిన సాంబయ్య మంగళవారం ఉదయం ఛాతిలో నొప్పిగా ఉందంటూ మండలంలోని ఘనాపూర్ గ్రామ పరిధిలోని మెడిసిటి ఆస్పత్రికి కుటుంబికులతో కలిసి వచ్చాడు. వైద్యులు చికిత్స చేపట్టగా సాంబయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడంటూ కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన చేయడంతో మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతుడి కుటుంబీకులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మల్లాపూర్: మహిళలు వివక్షకు గురవుతున్నామనే అపోహ వీడి అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ నెహ్రూనగర్‌లో మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. మహిళాలు సంఘాల అభివృద్ధి, మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికాభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, స్థానిక నేతలు మధన్, జగన్, రాము, లంబూ శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.